20-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మేము పరమాత్మ అయిన తండ్రి యొక్క యూనివర్సిటీలోని విద్యార్థులము, భవిష్య కొత్త ప్రపంచపు వారసత్వాన్ని పొందేందుకు చదువుతున్నాము అని మీకు గుప్తమైన సంతోషము ఉండాలి"

ప్రశ్న:- ఏ స్మృతిలో సదా ఉన్నట్లయితే దైవీ గుణాలు ధారణ అవుతూ ఉంటాయి?

జవాబు:- ఆత్మలమైన మనము శివబాబా సంతానము, బాబా మనల్ని ముళ్ళ నుండి పుష్పాలుగా తయారుచేయడానికి వచ్చారు - ఈ స్మృతి సదా ఉన్నట్లయితే దైవీ గుణాలు ధారణ అవుతూ ఉంటాయి. చదువు మరియు యోగముపై పూర్తి శ్రద్ధ ఉండాలి. వికారాల పట్ల ద్వేషము ఉండాలి. అప్పుడు దైవీ గుణాలు వస్తూ ఉంటాయి. ఏ సమయంలోనైతే ఏదైనా వికారము దాడి చేస్తుందో, అప్పుడు - నేను ముల్లును, నేనైతే పుష్పముగా అవ్వాలి అని భావించాలి.

ఓం శాంతి. మేము ఆత్మిక యూనివర్సిటీలో కూర్చున్నాము అని పిల్లల బుద్ధిలో ఉంది. ఈ నషా ఉండాలి. స్కూల్లో ఎలాగైతే సాధారణ రీతిలో కూర్చుంటారో, అలా ఇక్కడ మందబుద్ధి కలవారిగా అయి కూర్చోకూడదు. చాలామంది పిల్లలు మందబుద్ధి కలవారిగా అయి కూర్చుంటారు. ఇది ఉన్నతోన్నతుడైన పరమపిత పరమాత్ముని యూనివర్సిటీ, మనము వారి విద్యార్థులము అన్నది గుర్తుండాలి. మరి మీలో ఎంతటి నషా ఉండాలి. ఇది గుప్తమైన సంతోషము, గుప్తమైన జ్ఞానము. ఇక్కడ ప్రతి విషయమూ గుప్తమే. కొంతమందికి ఇక్కడ కూర్చున్నా కానీ బయటి అశుద్ధమైన ఆలోచనలు వస్తూ ఉంటాయి. ఇక్కడ మీరు భవిష్య కొత్త ప్రపంచ వారసత్వాన్ని పొందడానికి చదువుతారు. మరి మీకు ఎంతటి సంతోషము ఉండాలి. దైవీ గుణాలు కూడా ఉండాలి. ఇక్కడికి అందరూ బ్రాహ్మణులే వస్తారు. అక్కడి అశుద్ధత నుండి మీరు బయటపడి ఇక్కడికి వస్తారు. కావున పిల్లలైన మీరు ఎంతటి సంతోషములో ఉండాలి. మొత్తం ప్రపంచమంతా ఈ సమయంలో అశుద్ధతలో పడి ఉంది. కలియుగ అశుద్ధత ఎక్కడ, సత్యయుగ పూల తోట ఎక్కడ. కలియుగములో ఒకరికొకరు ముళ్ళను గుచ్చుకుంటూ ఉంటారు. మీరైతే ఇప్పుడు పుష్పాలుగా అవ్వాలి. కావున ఎంతటి సంతోషము ఉండాలి. మనం ఇప్పుడు పుష్పాలుగా అవుతాము. ఇది పూల తోట. బాబాను తోట యజమాని అని అంటారు. తోట యజమాని వచ్చి ముళ్ళను పుష్పాలుగా తయారుచేస్తారు. మేము ఎటువంటి పుష్పాలుగా అవుతున్నాము అన్నది పిల్లలైన మీకు తెలిసి ఉండాలి. ఇక్కడ పూల తోట కూడా ఉంది. మురళిని విని తర్వాత తోటలోకి వెళ్ళి పుష్పాలతో మిమ్మల్ని మీరు పోల్చుకోండి. నేను ఎటువంటి పుష్పాన్ని! నేను ముల్లుగా అయితే లేను కదా? ఏ సమయంలోనైతే క్రోధము వస్తుందో ఆ సమయంలో - నేను ముల్లును, నాలో భూతము ఉంది అని భావించాలి. అంతటి ద్వేషం కలగాలి. క్రోధమైతే అందరి మధ్యన వచ్చేస్తుంది. కామము అయితే అందరి మధ్యన జరుగదు. దానిని గుప్తంగా చేస్తారు. క్రోధమైతే బయటకు వచ్చేస్తుంది. క్రోధం చేస్తే దాని ప్రభావం కూడా కొన్నాళ్ళు కొనసాగుతుంది. క్రోధము యొక్క నషా కూడా ఉంది, అలాగే లోభము యొక్క నషా కూడా ఉంది. తమపై తమకే ద్వేషం కలగాలి. మమ్మల్ని బాబా పుష్పాలుగా తయారుచేస్తారు అని మీరు భావిస్తారు. కామము మరియు క్రోధము చాలా అశుద్ధమైనవి. అవి మనుష్యుల శోభనంతటినీ దూరం చేసేస్తాయి. ఇక్కడ శోభను చూపించినట్లయితే అక్కడ కూడా శోభను పొందుతారు. బాబా రోజు పిల్లలకు అర్థం చేయిస్తూ ఉంటారు - దైవీ గుణాలను ధారణ చేయండి. స్వర్గములోకి వెళ్ళాలి కదా. ఈ లక్ష్మీ-నారాయణులు ఎంతటి గుణవంతులు. మేము నీచులము, పాపులము, కాముకులము, మీరు సర్వగుణ సంపన్నులు అని వారి ముందుకు వెళ్ళి మహిమను కూడా గానం చేస్తూ ఉంటారు. స్వర్గము పూల తోట అని మరియు నరకము ముళ్ళ అడవి అని మీరు అర్థం చేయిస్తారు కూడా. శివబాబా స్వర్గ స్థాపనను చేస్తారు, రావణుడు నరకాన్ని తయారుచేస్తాడు. ఆలోచించాలి - ఆత్మలమైన మేము బాబా సంతానము, మరి మాలోకి అశుద్ధత ఎక్కడి నుండి వచ్చింది? ఒకవేళ అశుద్ధత ఉన్నట్లయితే బాబా పేరును అప్రతిష్ఠపాలు చేస్తారు. క్రోధం చేసినట్లయితే బాబాను నిందింపజేస్తారు. క్రోధము అనే భూతము వచ్చిందంటే బాబాను మర్చిపోతారు. బాబా స్మృతి ఉన్నట్లయితే ఎటువంటి భూతమూ రానే రాకూడదు. ఒకవేళ ఎవరి హృదయానికైనా దుఃఖాన్ని కలిగించినట్లయితే దాని ప్రభావం కూడా పడుతుంది. ఒకసారి క్రోధం చేసినట్లయితే ఆరు నెలల వరకూ - ఫలానావారు క్రోధి అని బుద్ధిలో ఉంటుంది. అప్పుడిక హృదయం నుండి దిగిపోతారు. అలాగే బాప్ దాదా హృదయం నుండి కూడా దిగిపోతారు. ఈ దాదా కూడా విశ్వానికి అధిపతిగా అవుతారు, వీరిలో కూడా తప్పకుండా విశేషతలు ఉంటాయి. కానీ ఎవరి భాగ్యంలోనైనా లేకపోతే వారు పురుషార్థం చేయరు. ఇది ఎంత సహజమైన పురుషార్థము, కేవలం బాబాను స్మృతి చేసినట్లయితే ఆత్మ స్వచ్ఛముగా అయిపోతుంది. దీనికి ఇంకే ఉపాయమూ లేదు. ఈ సమయంలో రాజర్షులుగా ఎవరూ లేరు, రాజయోగాన్ని

నేర్పించేవారు ఒక్క తండ్రే. మనుష్యులు మనుష్యులను తీర్చిదిద్దలేరు. బాబా వచ్చి అందరినీ తీర్చిదిద్దుతారు. ఎవరైతే చాలా బాగా మారిపోతారో, వారు సత్యయుగములో మొట్టమొదట వస్తారు. కావున ఏదైనా అశుద్ధమైన అలవాటు ఉన్నట్లయితే దానిని వదిలివేయాలి. చదువు పట్ల, యోగము పట్ల పూర్తి శ్రద్ధను ఉంచాలి. అందరూ ఒకే విధముగా ఉన్నతులుగా అవ్వరని కూడా తెలుసు. కానీ బాబా అయితే పురుషార్థము చేయిస్తారు. ఎంత వీలైతే అంత పురుషార్థము చేసి ఉన్నత పదవిని పొందండి. లేకపోతే కల్పకల్పాంతరాలూ పొందలేరు. బాబాను స్మృతి చేసినట్లయితే చెత్త తొలగిపోతుంది అని బాబా పదే-పదే అర్థం చేయిస్తూ ఉంటారు. ఆ సన్యాసులైతే హఠయోగాన్ని నేర్పిస్తారు. హఠయోగము ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, వారు ఎప్పుడూ రోగగ్రస్థులుగా అవ్వరని భావించకండి. అలా కాదు. వారు కూడా రోగగ్రస్థులుగా అవుతారు. భారత్ లో లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉన్నప్పుడు అందరి ఆయుష్షు ఎక్కువగా ఉండేది, ఆరోగ్యవంతులుగా, సుసంపన్నులుగా ఉండేవారు. ఇప్పుడైతే అందరూ బాగా తక్కువ ఆయుష్షు కలవారిగా ఉన్నారు. భారత్ ను ఈ విధంగా ఎవరు తయారుచేసారు? ఇది ఎవరికీ తెలియదు. పూర్తిగా ఘోర అంధకారములో ఉన్నారు. మీరు ఎంతగా అర్థం చేయించినా కానీ వారికి అర్థం చేయించడం అనేది చాలా కష్టం. అయినా పేదవారు, సాధారణమైనవారే అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఇక్కడ ఎవరైనా లక్షాధికారులు ఉన్నారా? ఈ రోజుల్లో లక్ష కూడా ఏమంత పెద్ద విషయం కాదు. ఈ రోజు లక్షాధికారులు ఎందరో ఉన్నారు. బాబా వారిని కూడా సాధారణమైనవారు అనే అంటారు. ఈ రోజుల్లో కోటీశ్వరుల విషయమే ఉంది. వివాహాలలో కూడా ఎంతగా ఖర్చు చేస్తారు. ఎవరికైనా బాణం తగిలే విధంగా పిల్లలైన మీరు చాలా యుక్తిగా అర్థం చేయించాలి. గొప్ప-గొప్ప వ్యక్తులైన ఎం.పి. మొదలైనవారు వస్తే ఎంతో సంతోషిస్తారు కానీ గట్టిగా శబ్దాన్ని వ్యాపింపజేసే శక్తి ఒక్కరిలో కూడా లేదు. మీరు అర్థం చేయిస్తారు కానీ యథార్థముగా, పూర్తిగా అర్థం చేసుకొని వెళ్ళరు. ఉన్నతోన్నతమైనవారు భగవంతుడు మరియు ఉన్నతోన్నతమైనది ఈ వారసత్వము. లక్ష్మీ-నారాయణులకు ఈ స్వర్గ వారసత్వాన్ని ఎవరు ఇచ్చారు? వారు ఎక్కడి నివాసులు? ఇది చాలామందికి తెలియదు. అర్థం చేసుకునేందుకు మ్యూజియంకు ఎంతోమంది వస్తారు. సేవ అవకాశం బాగుంది కానీ యోగము లేదు. బాబాను స్మృతి చేసినట్లయితే ప్రసన్నత కూడా వస్తుంది. మనం ఎవరి సంతానము. ఎంతమంది పిల్లలు నియమానుసారముగా చదువుకోరు. బాబాతో యోగము లేదు. సంపూర్ణముగానైతే ఇంకా ఎవ్వరూ అవ్వలేదు. నంబరువారుగా ఉన్నారు. పిల్లలు ఏకాంతములో కూర్చొని బాబాను స్మృతి చేయాలి. ఇటువంటి తండ్రి నుండి మనం స్వర్గ వారసత్వాన్ని పొందుతాము. ఈ ప్రపంచంలో మనమే అందరికన్నా పతితులుగా అయ్యాము, మళ్ళీ మనమే పావనులుగా అవ్వాలి. ఈ విషయాన్ని బాగా గుర్తు చేసుకోవాలి. ఈ-ఈ విధంగా చేయండి అంటూ బాబా అన్ని రకాల సలహాలను ఇస్తారు. క్వీన్ విక్టోరియా మంత్రి పేదవానిగా ఉండేవాడు, వీధి దీపాల కింద బాగా చదువుకొని ఉన్నత పదవిని పొందారు. ఆ అభిరుచి ఉండేది. అలాగే ఇది కూడా పేదవారి కొరకే. బాబా పేదల పాలిటి పెన్నిధి. షావుకార్లు భగవంతుడిని ఏమి స్మృతి చేస్తారు? మా కొరకు స్వర్గము ఇక్కడే ఉంది అని వారు అంటారు. అరే, బాబా ఇంకా స్వర్గ స్థాపనను చేయలేదు, ఇప్పుడు చేస్తూ ఉన్నారు, ఇప్పుడు తండ్రిని స్మృతి చేయండి, పావనంగా అయితే తప్పకుండా అవ్వాలి. భారత్ యొక్క ప్రాచీన యోగాన్ని పరమపిత పరమాత్మ తప్ప ఇంకెవ్వరూ నేర్పించలేరు అన్న విషయాన్ని ఎవరికైనా ఎలా అర్థం చేయించాలి అని పిల్లలు యుక్తిని రచించాలి. హఠయోగము నివృత్తి మార్గం వారి కొరకు ఉంది. తండ్రి అర్థం చేయిస్తూ ఉంటారు - ఎవరి కళ్యాణమైనా జరుగవలసి ఉన్నప్పుడు అదే విధముగా వ్రాయడం జరుగుతుంది. ఇప్పుడు ఇంకా సమయము ఉంది కావున అది ఎవరి బుద్ధిలోకి రావడం లేదు.

ఇది మీ ఈశ్వరీయ మిషన్. మీరు మనుష్యులను దేవతలుగా తయారుచేసే సేవను చేయాలి. ప్రపంచములోనైతే అనేక రకాల అభిప్రాయాలు వెలువడుతూ ఉంటాయి, ఎంతగా వాటికి షో ఉంది. అంధశ్రద్ధ ఎంతగా ఉంది. రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. బ్రాహ్మణులైన మీలో కూడా రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. కొందరికైతే ఏమీ తెలియదు. వాస్తవానికి ఇది చాలా సహజము - స్వయాన్ని ఆత్మగా భావించండి, తండ్రిని స్మృతి చేయండి, అప్పుడు పాపాలు అంతమైపోతాయి. దైవీ గుణాలను ధారణ చేసినట్లయితే ఈ విధంగా తయారైపోతారు. దండోరా మోగిస్తూ ఉండండి. దేహాభిమానం లేకపోతే మెడలో డోలును వేసుకొని అందరికీ చెప్తూ ఉండండి - తండ్రి వచ్చారు, వారు చెప్తున్నారు, నన్ను స్మృతి చేసినట్లయితే మీరు పతితుల నుండి పావనులుగా అయిపోతారు. ఈ సందేశాన్ని ఇంటింటికీ ఇవ్వాలి. అందరిపైనా తుప్పు పట్టి ఉంది. ఇది తమోప్రధాన ప్రపంచము, అందరికీ తండ్రి సందేశాన్ని తప్పకుండా చేర్చాలి. చివరిలో మీకు వాహ్-వాహ్ వెలువడుతుంది. ఇది వీరి అద్భుతము, వీరు ఎంతగానో మేల్కొలిపారు కానీ మేము మేల్కోలేదు అని అంటారు. ఎవరైతే మేల్కొన్నారో వారు పొందారు, ఎవరైతే పడుకున్నారో వారు పోగొట్టుకున్నారు. బాబా రాజ్యాధికారాన్ని ఇవ్వడానికి వస్తారు, అయినా కానీ పోగొట్టుకుంటారు. సేవ యుక్తులను రచించాలి. బాబా వచ్చారు, వారు చెప్తున్నారు - నన్నొక్కరినే స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి, పవిత్రముగా అయి

పవిత్ర ప్రపంచానికి యజమానులుగా అవుతారు. స్మృతి చేయకపోతే పాపాలు అంతమవ్వవు. ఏ విధమైన తుప్పు లేనప్పుడే ఉన్నత పదవిని పొందగలుగుతారు. లేకపోతే పదవి కూడా తక్కువగా ఉంటుంది, శిక్షలను కూడా పొందుతారు. సేవకు మంచి అవకాశము ఉంది. చిత్రాలను మీతో పాటు తీసుకువెళ్ళడం ద్వారా సేవను చేయగలుగుతారు. చిత్రాలను ఎప్పుడూ పాడవ్వని విధంగా మంచిగా తయారుచేయాలి. ఈ చిత్రాలు చాలా మంచివి. ఇకపోతే మోడల్స్ అయితే బొమ్మల వంటివి. గొప్ప-గొప్ప వ్యక్తుల చిత్రాలు పెద్ద-పెద్దగా ఉంటాయి. అవి వేలాది సంవత్సరాలు కూడా నడుస్తాయి. మీవి ఈ ఆరు చిత్రాలు సరిపోతాయి. మీరు చెప్పండి - ఈ సృష్టిచక్రం ఎలా తిరుగుతుందో మేము మీకు అర్థం చేయిస్తాము, ఈ చక్రాన్ని స్మృతి చేయడం ద్వారా మీరు చక్రవర్తీ రాజులుగా అయిపోతారు. బ్యాడ్జి కూడా చాలా బాగుంది. కానీ దీని విలువను పిల్లలు గుర్తించలేదు. దీనిపై మీరు అర్థం చేయించినా కూడా మీ సంపాదన ఎంతగానో జరుగుతుంది. ఈ బ్యాడ్జి ఛాతికి వేలాడుతూ ఉండాలి. ఈ బాబా ఈ బ్రహ్మ ద్వారా ఈ వారసత్వాన్ని ఇస్తారు. ట్రైన్ లో కూడా అంతా తిరుగుతూ ఇది అర్థం చేయిస్తూ ఉండండి. చిన్న పిల్లలు కూడా అర్థం చేయించవచ్చు. మిమ్మల్ని ఎవరూ వద్దనలేరు. ఈ బ్యాడ్జి ఎటువంటి వస్తువంటే, ఇందులో వజ్ర-వైఢూర్యాలు, ఫల-పుష్పాలు, మహళ్ళు అన్నీ ఇమిడి ఉన్నాయి. కానీ పిల్లల బుద్ధిలోకి ఇది రాదు. చిత్రాలు తప్పకుండా మీతో పాటు ఉండాలి అని బాబా ఎన్నో సార్లు అర్థం చేయించారు. మిమ్మల్ని కొందరు ఏదో ఒకటి అంటారు కూడా. ఎత్తుకుపోయాడని, అదీ, ఇదీ చేసేవాడని శ్రీకృష్ణునికి కూడా నిందలు వచ్చాయి కదా. కానీ వారిని కూడా మహారాణులుగా చేసాడు కదా. విశ్వానికి యజమానిగా అయి ఇటువంటి పనులు చేస్తారా? ఈ జ్ఞానములో నషా ఎంతగానో ఉండాలి. వినాశనం త్వరగా అయిపోవాలని మనం కోరుకుంటాము. మళ్ళీ ఇంకొకవైపు ఏమంటారంటే - ఇప్పుడైతే బాబా తోడుగా ఉన్నారు కదా, బాబాను వదిలేసినట్లయితే మళ్ళీ బాబా 5,000 సంవత్సరాల తర్వాతే లభిస్తారు, ఇటువంటి బాబాను మేము ఎలా వదలము? బాబా నుండైతే మేము చదువుతూనే ఉండాలి. ఇది బ్రాహ్మణుల ఉన్నతోన్నతమైన జన్మ. ఇటువంటి తండ్రి ఎవరైతే మనకు రాజ్యాన్ని ఇస్తున్నారో, వారిని మళ్ళీ మనం కలుసుకోలేము. కానీ గంగాతీరములో ఉండేవారికి దాని పట్ల అంతటి విలువ ఉండదు. బయట ఉండేవారు ఎంతటి మహత్వాన్ని ఉంచుతారు. ఇక్కడ కూడా బయట ఉండేవారు బలిహారమవుతారు. ఒకవేళ యోగబలం లేకపోతే అర్థం చేయించినప్పుడు ఎవరిపైనా ప్రభావం పడదు, వారు ఏమీ అర్థం చేసుకోరు. రావడం ఎంతోమంది వస్తారు, ఇలా-ఇలా అర్థం చేయించారు అని వ్రాస్తారు, చాలా బాగుంది అని అంటారు. కానీ బాబా అనుకుంటారు - వారు విన్నా కానీ ఏమీ విననట్లుగానే విన్నారు, ఏమీ అర్థం చేసుకోలేదు. అసలు వారు తండ్రినే తెలుసుకోలేదు. ఒకవేళ ఎంతోకొంత అర్థం చేసుకున్నట్లయితే ఇటువంటి తండ్రితో కనెక్షన్ అయితే పెట్టుకోవాలి కదా, ఉత్తరమైతే వ్రాయాలి కదా. ఇటువంటి తండ్రికి మీరు ఉత్తరాన్ని ఎలా వ్రాస్తారో చెప్పండి అని మిమ్మల్ని వెంటనే అడగాలి. అలా అడిగితే, శివబాబా కేరాఫ్ బ్రహ్మ అని చెప్పండి. దానితో వారు వెంటనే వ్రాయడం మొదలుపెట్టాలి. వీరు రథము కదా. కానీ ఎక్కువ విలువైతే, ఎవరైతే వీరిలోకి ప్రవేశిస్తారో వారికే ఉంది.

సేవ చేస్తూ-చేస్తూ ఎంతోమంది పిల్లల గొంతులు అలసిపోతాయి. కానీ యోగము లేకపోతే బాణం తగులదు. దీనిని కూడా డ్రామా అనే అంటారు. బాబాను తెలుసుకున్నట్లయితే బాబాను కలుసుకోకుండా ఉండలేరు. ట్రైన్ లో కూడా - మేము బాబా వద్దకు వెళ్తున్నాము అంటూ యోగయుక్తులుగా రావాలి. విదేశాల నుండి వచ్చినప్పుడు భార్యా-పిల్లలు మొదలైనవారందరూ గుర్తుకొస్తారు కదా. ఇక్కడ మనం ఎవరి వద్దకు వెళ్తున్నాము! మరి దారిలో ఎంతటి సంతోషము ఉండాలి. సేవ చేస్తూ-చేస్తూ రావాలి. బాబా సాగరుడు. పిల్లలు ఫాలో చేస్తున్నారు, జ్ఞాన అలలు ఉప్పొంగుతూ ఉన్నాయి అన్నది చూసినప్పుడు, అది చూసి సంతోషిస్తారు. ఇతనైతే చాలా మంచి సుపుత్రుడు. ఉదయం చేసే స్మృతియాత్రలో ఎంతో లాభం ఉంది. అలాగని కేవలం ఉదయం మాత్రమే స్మృతి చేయాలి అని కాదు. లేస్తూ-కూర్చుంటూ, తింటూ-తాగుతూ స్మృతి చేసినట్లయితే, సేవ చేసినట్లయితే, మీరు యాత్రలో ఉన్నట్లే. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఎవరి హృదయానికీ దుఃఖాన్ని కలిగించకూడదు. లోపల ఏదైనా భూతము ఉన్నట్లయితే చెక్ చేసుకుని దానిని తొలగించుకోవాలి. పుష్పాలుగా అయి అందరికీ సుఖాన్ని ఇవ్వాలి.

2. మనము జ్ఞానసాగరుని పిల్లలము కావున లోలోపల జ్ఞాన అలలు సదా ఉప్పొంగుతూ ఉండాలి. సేవకు యుక్తులను

రచించాలి, ట్రైన్ లో కూడా సేవ చేయాలి. దానితోపాటు పావనంగా అయ్యేందుకు స్మృతియాత్రలో కూడా ఉండాలి.

వరదానము:- స్మృతి మరియు సేవ యొక్క బ్యాలెన్స్ ద్వారా తండ్రి సహాయాన్ని అనుభవము చేసే ఆశీర్వాదాలకు పాత్రులయ్యే ఆత్మా భవ

ఎక్కడైతే స్మృతి మరియు సేవ యొక్క బ్యాలెన్స్ అనగా సమానత ఉంటుందో, అక్కడ తండ్రి యొక్క విశేష సహాయము అనుభవమవుతుంది. ఈ సహాయమే ఆశీర్వాదము, ఎందుకంటే బాప్ దాదా ఇతర ఆత్మల వలె ఆశీర్వాదమును ఇవ్వరు. తండ్రి ఉన్నదే అశరీరులుగా, కావున సహజంగా, స్వతహాగా సహాయము లభించటమే బాప్ దాదా ఇచ్చే ఆశీర్వాదము, దీని ద్వారా ఏదైతే అసంభవముగా ఉందో అది సంభవమవుతుంది. ఇదే సహాయము అనగా ఆశీర్వాదము. మీరు ఒక్క అడుగులో పదమాల సంపాదన జమ అయ్యేటటువంటి ఆశీర్వాదానికి పాత్రులైన ఆత్మలు.

స్లోగన్:- సకాష్ ను ఇచ్చేందుకు అవినాశీ సుఖము, శాంతి మరియు సత్యమైన ప్రేమ యొక్క స్టాక్ ను జమ చేసుకోండి.